

# జీర్ణదేహి చిరునవ్వు

ఆ చింకి గోచీగుడ్డ, చింపిరిజుత్తు, ఆకలిచే అడుచుకుపోయిన కడుపు, ముఖాన్న తాండవిస్తూన్న దీనలక్షణాలు—దేహం కొరుక్కుతినేస్తూన్న కుష్ఠురోగం ఎవరికి జాలిగొల్పవు? కాని అలా అనుకోడం వట్టి పొరపాటు. నిజంగా ఆపేదజీవిని చూచి అందరూ జాలిపొందేఉంటే ఒక్కొక్క రోదమ్మిడీ పారేసీవారే!........

'బాబూ, తమరు కిల్లీవేసుకున్న పాటిలేదు, నే నడుక్కూనీ దల్లా ఒక్క దమ్మిడీ! రెండు రోజులాయి తిండిలేదు, ఆకలి దహించుక పోతున్నాది స్వామీ! పండుగపూటా పుణ్యంకట్టుకో నాయినా!' అంటూ, ఎంత కఠిన హృదయుడికేనా సరే హృదయం కరిగేటట్టు ఏడుస్తున్నా డారోగి, ఓ కాఫీ క్లబ్బు ముందర రోడ్డుమీద. అతనిదేహం నిండా చెమ్మట కారుతూంది, ఎండలో అతనిదేహం మాడుతూంది; త్రోవబోయే మోటార్లు, బళ్ళు వల్ల చెలరేగిన రోడ్డుధూళి అతని జబ్బుదేహముపైకి రేగి అతని హృదయానికి భరింపరాని బాధ కలుగజేస్తున్నాది.

క్లబ్బునుండి బైటకు వస్తూన్న ప్రతి సుఖజీవీ తప్పుచేసిన వాడిలా పెడముఖంతో అతన్ని తప్పించుక పోతున్నాడే కాని అతని మొరాలకించలేదు. ఇక వృథాప్రయాస అనుకున్నాడతడు—! అతడు బాగా అలసట చెందేడు, కాల్తూన్న రోడ్డుమీదే మేను వాల్చేడు; చేతులతోనీ కళ్ళతోనీ మాత్రం తన దీనత్వాన్ని ప్రతివారికీ తెలుపుతున్నాడు. 'నీ లాంటి వాళ్ళెందరున్నారో? ఎంతని దమ్మిడీలు తేవడం!' అంటూ, సుంతేనా జాలిలేకుండా ఆదుఃఖజీవి ప్రార్థన త్రోసిపుచ్చి వచ్చేడో ఆసామీ. ఈ శిలాహృదయు డెందరు ముష్టివాండ్ర కిలా జవాబుచెప్పి తప్పించుకున్నాడో; లేదా ఎన్నో దమ్మిడీలు దానంచేసి, చేసి దానకర్ణుడుతో సముడై, యింక దానం చెయ్యడం అనవసరమని అతని ప్రార్థన నిరాకరించేడో; తెలీదు.

* * *

పూర్తిగా నిస్పృహ చేసుగు ఆక్లబ్బు దగ్గర్నుంచి పాకురుతూ కదిలేడా దురదృష్టజీవి!........

అక్కడ ప్రజలంతా గుంపులు గుంపులుగా కూడి ఉన్నారు. భిక్షుకు డచ్చటకు పోయేడు. 'బాబూ, మీరు కాల్చుగోడానికి కొనీ సామాను ఖరీదులో సహస్రాంశం ఉండదు; ఒక్కదమ్మిడీ యీకటికి దరిద్రుడుకి దానంచేసి పుణ్యంకట్టుకోండి స్వామీ!' అంటూ మామూలు పాటారంభించేడతడు. రూపాయిలకి రూపాయిలు కాకకపువ్వు పత్తలకు టపాకాయలకు వెచ్చిస్తూన్న యువకుల

పాదాలచెంత వృథాగా విలపిస్తున్నాడతడు! ... ...

'బాబూ, పండుగపూటా పుణ్యం కట్టుకోండి నాయినా,' అన్నాడు, కాని అక్కడ ఎవ్వరికీ ఆ దీనుడి విలాపం వినిపించలేదు.

* * *

అతడలా పుండులా ఉన్న దేహంతో ఎలాగో పాకురుతూ పోతున్నాడు. ప్రతి గుమ్మంముందర ఆగి, 'అమ్మా, పట్టెడన్నం పెట్టమ్మా, పండుగపూటా కడుపు మాడుతూంది!....పిడికెడు మెతుకులువేసి పుణ్యం కట్టుకో తల్లీ!' అని ప్రార్థిస్తున్నాడు. 'గంపెడు పిల్లల్తో ఉన్నవాళ్ళం, అహ్వ! నీకేంపోగరు పుట్టెడు రోగంతో గుమ్మంమీది కాళ్ళు పోస్తున్నావ్? రోడ్డుమీంచి ఏడవలేవ్—' అంటూ చీపురుకట్ట పట్టుకు అతని మీదికి యుద్ధానికొచ్చిందో యిల్లాలు! అతడో వేడి నిట్టూర్పువిడిచి ప్రక్కకు తొలిగేడు. ఇంతలో 'బాఁ, బాఁ' అని, 'టంగ్, టంగ్' అని, 'టక్, టక్' అని, కార్లు, సైకిళ్లు, జట్కాలు మొదలగువాని చప్పుళ్లు అందులోనే అస్పష్టంగా 'అమ్మో' అనే కేక—! మరేవుంది! అతని జీర్ణదేహం మీంచి ఓ మోటారుసైకిలు నడిచింది! సయికిలుమీది మనిషిదిగి 'ఏం బుద్ధిలేదూ? పశువ్వా? తోవకడ్డంగా ఉండి సైకిలెటుతిప్పితే అటు వస్తావా?' అని తూల కనుగు కసిరేడా బిచ్చగాణ్ణి. భిక్షువు నిర్విణ్ణుడయ్యేడు. అతని కింకా కొనప్రాణం మాత్రం ఉంది. అతడు శూన్య దృక్కులతో ఆసైకిలు మనిషిని చూసేడు, రెండు వేడికన్నీటి బిందువులు రాల్చేడు.

'నాయనా, అవును.........పొరపాటు, క్షమించు!' అన్నాడు, అతనికంఠం రుద్ధమై పోయింది; 'కాని నీ మేలు మరువను, నా కష్టాలు తీర్చేవు—'అని ముగించే డతి కష్టం మీద. ఆబిచ్చగాడు విగత జీవుడయ్యాడు, కాని అతని పెదవులమీద చిరునవ్వు తాండవిస్తూన్నాది! అతని పెదవులకి ఆదిచిరునవ్వు తుదిచిరునవ్వు రెండూ యిదే!

—వఝ్ఝల కృష్ణమూర్తి.

# రామరాజభూషణుఁడు

౧

ఉ॥ దాటవశంబుగాని కవి తానియమోన్నత భిత్తికల్పి రా
ఘాటబవంబు నన్నగసి గంతులువెట్టెడు నీదుశ్లేషవా
గ్ధాటికిఁ, బెద్దనాది కవి దంతులు తత్తరమంద లేదె? యా
నాటికి, నేటి, కింకనొఁక నాటికి, నీకెదురేరి? సత్కవీ!

౨

ఉ॥ కాపు కవిత్వమెవ్వనికి కమ్మదనంబగునంచు నెన్ని రో
లోషములెన్ని, నిన్నుసభలో నవమానముసేయు లింగనిన్
గోషముసేయకింక ననుకొమ్మని, చక్కదనాలకబ్బవుం
గాపులు గాచిపోయితివిగా? కవితా దివిజద్రుమంబునన్.

—జి. జాషువ.